మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు



దేవతా విగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ, కొండ పోచమ్మ, మైసమ్మ, చిత్తారమ్మ, నాగదేవత విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నూతన విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 26న మల్లికార్జునస్వామి జాతర ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే స్వామివారి మేల్కొలుపు, కొట్నం, కల్యాణ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఐకమత్యమే సమస్యలకు పరిష్కారం

పంజగుట్ట: క్రైస్తవులు ఐకమత్యంగా సమన్వయంతో తమ సమస్యలు పరిష్కరించుకోవాలని రాష్ట్ర మాజీ డీజీపీ స్వర్ణజిత్ సేన్ అన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్, క్రిస్టియన్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణజిత్ మాట్లాడుతూ.. క్రైస్తవులపై దాడులు జరిగితే తక్షణమే స్పందించేలా స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధి జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులపై దాడులు తగ్గుతాయనుకుంటే ఇంకా పెరిగాయని ఆరోపించారు. జన్వాడలో చర్చిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు చెప్పారు.

అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు ఇతర సామగ్రిని అందజేస్తున్న నాగరాజుయాదవ్

సుభాష్‌నగర్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని నాగరాజ్ యాదవ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ దులపల్లిలోని అంగన్వాడీ–3 సెంటర్‌లో గ్రామానికి చెందిన పాడే రైతు చింతల నాగరాజ్‌యాదవ్ మంగళవారం ఫ్యాన్లు, మ్యాట్లు ఇతర సామగ్రిని అందించారు. స్థానికంగా ఉన్న అంగన్వాడీ సెంటర్లలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ సుకన్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పంజగుట్ట: దేశంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని అలాంటి రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా రైతుల ఆత్మహత్యలు ఆగకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 'రైతు సోదరులు ఆత్మహత్య పరిష్కారం కాదు.. పోరాడి హక్కులను సాధించు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పదేళ్లలో ప్రధాని మోదీ పాలనలో వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. 2014 తర్వాత రైతుల ఆత్మహత్యలపై కేంద్ర ప్రభుత్వం కనీసం ప్రకటనలు కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రొఫెసర్ పద్మజా షా, నైనాల గోవర్ధన్, రవీందర్, అంబు రాథోడ్, కరుణాకర్ దేశాయ్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు పదవుల్లో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోరన్నారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం రైతులపై ఎంతో ప్రేమ కురిపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పండ్లు అందజేస్తున్న కేఎం ప్రతాప్

రంగారెడ్డినగర్: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులపై శ్రద్ధ చూపించి ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రీప్రైమరీ విద్యార్థులకు ఆయన పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... విద్యార్థులు బాల్యం నుంచే పోషక విలువలు గల ఆహారాన్ని, పండ్లను తీసుకోవాలన్నారు. సరైన పోషకాహారం అందినపుడే వారు చదువుల్లో రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు భూలక్ష్మి, శ్రీరమ్య, అరుంధతి, శిరీష, పద్మజ, రజిత, మౌనిక, విజయలక్ష్మి, రమ్యశ్రీ, కృష్ణవేణి, శ్రీజ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ భార్గవి రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం

లిబర్టీ: రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తి తామే అన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్రంలోని దళిత బహుజనుల ప్రజా సమస్యల పరిష్కరించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు.

వార్డుల వారీగా..

చెత్త సేకరణ బాధ్యతలు

నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ నీలారెడ్డి

- కౌన్సిల్ సమావేశంలో ఆటో కార్మికుల విషయమై చర్చ
- 10 మెట్రిక్ టన్నుల వరకు చెత్త సేకరించుకునేలా చర్యలు
- ఆటో వాలాలపై ప్రైవేట్ వ్యక్తుల దాదాగిరి సహించేదిలేదు
- కార్పొరేషన్ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకున్న యంత్రాంగం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణరావు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్: చెత్త సేకరణ ఆటో రిక్షా వాలాలపై ప్రైవేట్ వ్యక్తుల పెత్తనాన్ని సహించబోమని.. చెత్త సేకరణ విషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికుల మధ్య చోటు చేసుకున్న గొడవ, పరస్పర దాడులపై మంగళవారం కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన జరిగిన నిజాంపేట్ కౌన్సిల్ సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది.

◆ ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ... నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వార్డుల వారీగా రోజువారీ ఎంత చెత్త సేకరణ అవుతోందన్న దానిపై అధికారులలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతామన్నారు. 5 మెట్రిక్ టన్నులు మొదలుకుని 10 మెట్రిక్ టన్నుల వరకు ఒక్కో రిక్షా కార్మికుడికి వార్డుల వారీగా చెత్త సేకరించే బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

◆ ఆటో వాలాలపై ప్రైవేట్ వ్యక్తుల దాదాగిరిని ఇకపై సహించేది లేదన్నారు. ఎవరైనా దాడులకు, వసూళ్లకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కొత్తగా హైడ్రాలిక్ చెత్త సేకరణ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో శానిటరీ మేనేజర్, ఎన్విరానిమెంట్ ఇంజినీర్లను బాధ్యులుగా ఉంచుతామన్నారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నూతనంగా చేపట్టబోయే పనులపై చర్చించారు. రాబోయే వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అదే విధంగా రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇతర సమస్యలపై ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని మేయర్ ఆదేశించారు.



సాక్షిలో వచ్చిన వరుస కథనాలు

అభ్యర్థి ఎవరైనా కలిసి పని చేస్తాం

కుత్బుల్లాపూర్: జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే దిశగా పని చేయాలని ఇద్దరం నిర్ణయించుకున్నట్లు ఇరువురు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పూర్తిగా మద్దతు తెలుపుతూ కలిసి పని చేస్తామన్నారు.



కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసిన బొంతు రామ్మోహన్

ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్ ముదిరాజ్, అవిజె జేమ్స్, గడ్డం రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ జారి పడటంతో యువకుడు మృతి

కుత్బుల్లాపూర్: ద్విచక్ర వాహనం జారి పడిన ఘటనలో ఓ బైకిస్ట్ అక్కడికక్కడే మృతి చెందిన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన ఆర్కల వంశీ(25) తన హీరో ఫ్యాషన్ బైక్(ఏపీ 10ఏఎ 5 7929)పై కొంపల్లి మీదుగా తూప్రాన్‌కు వెళ్తుండగా, కొంపల్లి సమీపంలోని జీవీకే ఈఎంఆర్‌ఐ కార్యాలయ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని బీఆర్‌ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌లోని సర్వే నంబరు 214లో రూ.45 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ జోస్ఫిన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. పనులను నకాలంలో పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, కరీమా, గుడిసె ఈశ్వర్, మోర హరీష్, సతీష్, మోహన్, పుల్ సింగ్, రాజు, యోగి, భారతి, శ్రీనివాస్, మంజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న శంభీపూర్ కృష్ణ

ఎన్నికల సమగ్ర నియమావళిపై లేఖ

పంజగుట్ట: రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేలా నైతిక ప్రవర్తనా నియమావళి అమలు చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ గ్లోబల్ పీస్ సంస్థ కోరింది. అన్ని రాజకీయ ప్రచారాల కోసం ప్రస్తుత మోడల్ ప్రవర్తనా నియమావళిని సమగ్రంగా రూపొందించాలని కోరుతూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఆధ్వర్యంలో లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం అధ్యక్షుడు శ్యామ్‌మోహన్, ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు, సెక్రటరీ శ్రావణ్, చరిత్రకారులు డాక్టర్ కొల్లూరి చిరంజీవి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు, వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటాన్ని కట్టడి చెయ్యాలన్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, బహుమతులు పంపిణీ అడ్డుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలు నిలబెట్టడంలో భారత ఎన్నికల సంఘానిది కీలకపాత్ర అని.. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువు కబ్జా నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తాం

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- దుండిగల్ చిన్న దామెర చెరువు పరిశీలన



వివిధ శాఖల అధికారులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

దుండిగల్: హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లోని 13 చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని కొందరు వ్యక్తులు 2007లో హైకోర్టులో కేసు వేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం వాటిపై పూర్తిగా దర్యాప్తు చేయాలని ప్రత్యేక న్యాయ నిపుణుల బృందాన్ని నియమించింది. ఇందులో భాగంగా సదరు బృందం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి చెరువులను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీన డిప్యూటీ సొలిసిటర్ ఆఫ్ ఇండియా ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ విభాగం ప్లీడర్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు బృందం సభ్యులు చెన్న దామెర చెరువును పరిశీలించారు. 8.24 ఎకరాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

◆ స్పందించి చెరువును పరిశీలించిన కలెక్టర్..

ప్రత్యేక బృందం సభ్యులు అందజేసిన వివరాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్ మంగళవారం స్వయంగా చిన్న దామెర చెరువును పరిశీలించారు. ఆర్డీవో శ్యాం ప్రకాశ్, గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ మతిన్, ఇరిగేషన్ ఏఈ సారా, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణలతో కలిసి చెరువును సందర్శించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కబ్జా వివరాలను ఆయనకు వివరించారు.

◆ ఎర్రకుంట, పరికి చెరువులను సైతం పరిశీలిస్తా..

ఇప్పటికే చెరువు కబ్జా వివరాలు తన వద్ద ఉన్నాయని, పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి, హైకోర్టుకు సమర్పిస్తామని, ఆక్రమణలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఎర్రకుంట, పరికి చెరువులను సైతం పరిశీలిస్తామన్నారు. దీనిపై సమీక్షా సమావేశం నిర్వహించి చెరువులపై ప్రత్యేకంగా చర్చిస్తామన్నారు.

ఎవరి స్థలం కబ్జా చేయలేదు..

దుండిగల్‌లో 1990 నుంచి 1995 వరకు మేము 55 ఎకరాలు కొనుగోలు చేశాం. 2000లో కళాశాల నిర్మించాం. 55 ఎకరాల పట్టా భూమి ఉంది. గత 24 సంవత్సరాల నుంచి కాలేజీ నడుపుతున్నాం. మేము ఎవరి స్థలం కబ్జా చేయలేదు. మా స్థలం నుంచే రింగ్ రోడ్డుకు 15 ఎకరాలు పోయింది. మేము కేసు కూడా వేశాం. నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. మిగిలిన 40 ఎకరాల్లో 20 ఎకరాలు శిఖం ల్యాండ్ అని 2013లో చెప్పారు. మిగతా 20 ఎకరాల్లో కళాశాల బిల్డింగ్‌లు ఉన్నాయి. శిఖం ల్యాండ్‌లో పార్కింగ్, ఆట స్థలం ఉన్నాయి. శిఖం స్థలమైనా వాటికి కూడా పట్టాలు ఉన్నాయి.

– మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తాం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటామనిఇ.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తప్పకుండా తెలంగాణలో అత్యధిక సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10గంటలకు ఉత్సవ ఆరంభ స్నపనం, సాయంత్రం 6గంటలకు విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, అక్కురారోణం, 23వ తేదీన ఉదయం 9గంటలకు వైనతేయ ప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు దేవతాహ్వానం, గజవాహన పల్లకిసేవ, 24న ఉదయం 9 గంటలకు హోమ బలిహరణం, సాయంత్రం 6 గంటలకు హనుమత్ వాహన సేవ, రాత్రి 9 గంటలకు స్వామివారి ఎదుర్కోలు, రాత్రి 10 గంటలకు తిరుకల్యాణోత్సవం, 25న ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం, రాత్రి 8 గంటలకు గరుడ వాహనసేవ, 26న ఉదయం 9 గంటలకు హోమ బలిహరణం, స్వామివారికి అభిషేకం, ప్రత్యేకలంకరణ, రాత్రి 10 గంటలకు రథోత్సవం, 27వ తేది ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, రాత్రి 7 గంటలకు శ్రీపుష్పయాగం, ద్వాదశ ఆరాధన, ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలుంటాయని, బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులుకావాలని ఆలయ కమిటీ కోరింది.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



బీజేపీ నేత భరతసింహారెడ్డిని సత్కరిస్తున్న బృందావనకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జీడిమెట్ల డివిజన్ బృందావన కాలనీలో పర్యటించి స్థానికంగా నెలకొన్న బోరు, పార్కు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ... కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. కాలనీ అధ్యక్షుడు రవి గౌడ్, సెక్రటరీ రమణ కుమార్ రాజు, జోగారావు, రాజేష్, వెంకటేశ్వర్లు, మురళి, సత్తికొండ, సామయ్య, వంశీ, ప్రదీప్, కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, నాగదీప్ గౌడ్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

శివసాయిక్షేత్రంలో పూజలు

రాయదుర్గం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, విశ్వేశ్వరస్వామికి మహన్యాస పూర్వకరుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నిజాంపేట్: ప్రగతినగర్ ఐరీస్ ఫ్లోరెట్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. నగరంలోని శిల్పకళా వేదికలో నిర్వహించిన వేదికలో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చదువుతో పాటు ఆట పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా తమ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు.



ఐరీస్ ఫ్లోరైట్స్ ప్లేస్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

సుభాష్‌నగర్ హత్య కేసులో వీడిన మిస్టరీ

- వెస్ట్ బెంగాల్‌లో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల పోలీసులను అభినందించిన ఏసీపీ

జీడిమెట్ల: ఈనెల 9వ తేదీన సుభాష్‌నగర్‌లో వెలుగుచూసిన హత్యకేసులో నిందితుడిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జీడిమెట్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంతారావు జీడిమెట్ల సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్సై హరీష్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. సుభాష్‌నగర్‌కు చెందిన ఎండీ యాసిన్‌బేగ్(48) స్థానికంగా పాన్‌షాపు నిర్వహించేవాడు. ఓ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన యాసిన్‌బేగ్ తన పాన్‌షాపును అమ్ముకుని కూలీ పనులు చేస్తున్నాడు. కొంతకాలంగా యాసిన్‌బేగ్ మద్యానికి బానిసవ్వడంతో భార్య పిల్లలు అతడిని వదిలి వెళ్లిపోయారు.

◆ అప్పటి నుంచి ఒక్కడే సుభాష్‌నగర్ మార్కెట్ ప్రాంతంలోని అద్దె గదిలో ఉంటున్నాడు. కాగా అతని యాసిన్‌బేగ్ గది పక్కనే వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఫేకుఖాన్ (27) సైతం ఉంటున్నాడు. ఫేకుఖాన్ యాసిన్‌బేగ్ వద్ద చిన్న మొత్తాన్ని అప్పుగా తీసుకున్నాడు. ఈనెల 8వ తేదీన యాసిన్‌బేగ్ మద్యం కొనుగోలు చేసి తన గదిలో మరో స్నేహితుడు రావూఫ్‌తో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఈక్రమంలో వారి వద్దకు ఫేకుఖాన్ సైతం వచ్చాడు. ఈ క్రమంలో డబ్బు విషయంలో యాసిన్‌బేగ్, ఫేకుఖాన్ మధ్య గొడవ జరిగింది.

◆ ఇద్దరి మధ్య గొడవ జరుగుతుండటంతో రావూఫ్ అక్కడ నుంచి లేచి వెళ్లిపోయాడు. ఇద్దరి మధ్య గొడవ తీవ్రం కావడంతో యాసిన్‌బేగ్ తన గదిలో ఉన్న రంపంతో కొట్టేందుకు ప్రయత్నించగా ఫేకుఖాన్ రంపం లాక్కుని యాసిన్‌బేగ్‌ను మెడ, ముఖంపై తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో యాసిన్‌బేగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. 11వ తేదీన నిందితుడు ఫేకుఖాన్ వెస్ట్‌బెంగాల్‌కు పారిపోయాడు.

◆ అదే రోజు రాత్రి గది నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ప్రాథమిక ఆధారాలను సేకరించిన పోలీసులు ఫేకుఖాన్‌ను నిందితుడిగా భావించి ఎస్సై హరీష్ మరో కానిస్టేబుల్ సహాయంతో ఈనెల 16న వెస్ట్‌బెంగాల్‌కు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 19వ తేదీన పీఎస్‌కు తీసుకు వచ్చారు. మంగళవారం నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై హరీష్, కానిస్టేబుల్ ప్రభాకర్‌లను ఏసీపీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ హనుమంతారావు